క్లుప్తంగా

డోలక్ విద్వాంసుడు బుల్లబ్బాయికు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం శ్రీకృష్ణార్జున యుద్ధం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం ఆరాధన చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం డోలక్ విద్వాంసుడు గురిందపల్లి బుల్లబ్బాయిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గట్టిపాటి రాంబాబు, అప్పల కిశోర్, జొన్న రవి, నాగళ్ల హరీష్, వాసిరెడ్డి హనుమంతరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, ముళ్లపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హకీంజానీకి సరస భారతి ఉగాది పురస్కారం



తెనాలి: కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన సాహిత్య, సాంస్కృతిక సంస్థ 'సరస భారతి' సంస్థ పట్టణానికి చెందిన బాల సాహితీవేత్త, ఫ్రీలాన్స్ జర్నలిస్టు షేక్ అబ్దుల్ హకీంజానీకి ఉగాది పురస్కారం ప్రదానం చేసింది. ఆదివారం రాత్రి ఉయ్యూరులో సరస భారతి 172వ కార్యక్రమంగా జరిగిన ఉగాది వేడుకల్లో మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, సంస్థ అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్ చేతులమీదుగా పురస్కారాన్ని హకీంజానీకి అందజేశారు. నూతన వస్త్రాలతోపాటు రూ.3 వేలను బహూకరించారు. సినీ, టీవీ, రంగస్థల నటుడు ఎస్‌కే మిశ్రో, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ ప్రభృతులు పాల్గొన్నారు.

దాడి కేసులో జరిమానా

తెనాలి రూరల్: దాడి కేసులో నిందితులకు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం తోకలవారిపాలేనికి చెందిన అన్నదమ్ములు పూలపాటి గోవిందరావు, శ్రీనివాసరావు మధ్య విభేదాలున్నాయి. ఈ క్రమంలో 2017 డిసెంబర్ 24న గోవిందరావుపై శ్రీనివాసరావు, చిట్టిమ్మ, గుంటూరు శోభన్‌బాబు, ఇస్సాకు, నిర్మల, స్వప్న దాడి చేసి గాయపర్చారు. ఈ మేరకు గోవిందరావు కొల్లూరు పోలీసుల్ని ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. కేసు సోమవారం విచారణకు రాగా సాక్ష్యాధారాల్ని పరిశీలించిన రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. శ్రీసీత నిందితులకు రూ. 500 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

గుండెపోటుతో మైనారిటీ నేత కుమారుడి మృతి



షాహిర్ ఆలీ (ఫైల్)

తెనాలి: పట్టణానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ మైనారిటీ నేత గోల్డ్ రహిమా తనయుడు షాహిర్ ఆలీ (33) గుండెపోటుతో సోమవారం హఠాన్మరణం చెందారు. ఆయనకు భార్య, ఏడేళ్ల కొడుకు ఉన్నాడు. ఉదయం గుండెనొప్పి వచ్చిన కొద్దిసేపటికే మృతి చెందినట్టు తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మార్కెట్ ఏరియాలోని వారి నివాసానికి వెళ్లి షాహిర్ ఆలీ భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. గోల్డ్ రహిమాకు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వీరితోపాటు పలువురు మైనారిటీ నాయకులు పుష్పాంజలి ఘటించారు. అంత్యక్రియలు మంగళవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

పని ప్రదేశంలో కూలి మృతి

తెనాలి రూరల్: పని ప్రదేశంలో కూలి అకస్మాత్తుగా మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ గురవయ్యకాలనీకి చెందిన బోనకుర్తి రాజు(45) కూలి పనులకు వెళుతుంటాడు. సోమవారం ఉదయం ఇస్లాంపేటలో పనికి వచ్చాడు. సాయంత్రం పని ముగిశాక చేతులు కడుగుకుంటుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. తోటి కూలీలు వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు వైద్యశాలకు వెళ్లి మృతుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైల్లో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దుగ్గిరాల–పెదవడ్లపూడి స్టేషన్ల మధ్య మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని సోమవారం పరిశీలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 మధ్య ఉంటుంది. నల్ల ప్యాంటు, తెల్ల కట్ బనియన్ ధరించి ఉన్నాడు. మృతి చెంది వారం రోజులై ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి నంబరు లేక అగచాట్లు

- ఇళ్ల స్థలాలు ఇచ్చారు.. పట్టాలు మరిచారు
- స్పందన సమావేశంలో అర్జీదారుల ఆవేదన



సబ్ కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న మహిళలు

తెనాలి: పట్టణ గురవయ్య కాలనీ శివారు పూలే కాలనీలో నివసిస్తున్న తమకు పట్టాల లేదా బీఫారాలు ఇప్పించాలని కోరుతూ ఆ కాలనీకి చెందిన పలువురు మహిళలు తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన సమావేశంలో అర్జీనిచ్చారు. సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ స్వీకరించారు. గతంలో స్థానిక వైకుంఠపురం కాల్వ కట్ట పక్కన నివాసం ఉండే తమ ఇళ్లను అధికారులు ఆక్రమణలుగా గుర్తించి తొలగించినట్టు గుర్తు చేశారు. రోడ్డుపాలైన తమకు నివాస స్థలాలు కేటాయించాలని కోరుతూ 41 రోజులు నిరాహార దీక్ష చేసినట్టు తెలిపారు. ఫలితంగా అప్పటి తహసీల్దారు ఏసురత్నం దీక్షా శిబిరాన్ని సందర్శించగా, తమ ఇక్కట్లను విన్నవించామన్నారు. దీంతో ఆయన తమ 84 కుటుంబాలకు రామలింగేశ్వరపేట గురువయ్య కాలనీ శివారులో గల పూలే కాలనీలో గల పాత డ్రైనేజీ పథకం స్థలంలో ప్లాట్లను కేటాయించినట్టు వివరించారు. ఒక్కో కుటుంబానికి 72 గజాల స్థలం ఇవ్వడంతో 20 ఏళ్లకు పైగా అక్కడే తాత్కాలిక ఆవాసాలతో నివాసం ఉంటున్నట్టు తెలిపారు. తమకు పట్టాలు లేకపోవడంతో డోర్ నంబరు రాలేదన్నారు. దీంతో తమ పిల్లల చదువులకు, స్కాలర్‌షిప్‌కు, ఉద్యోగాలకు అవసరమైన చిరునామా సమస్యగా మారిందని వివరించారు. పట్టాలతో పాటు రోడ్లు, మురుగు కాల్వలు, మంచినీటి పైపులైను ఏర్పాటు చేయాలని సబ్‌కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. అర్జీ అందజేసినవారిలో జి.లక్ష్మి, టి.వెంకటలక్ష్మి, షేక్ సైదా, జి.జ్యోతి, జి.మల్లేశ్వరి, పి.కరిమా, ఎ.లోకయ్య, పి.నాగమల్లేశ్వరి తదితరులున్నారు. సబ్ కలెక్టర్ 'స్పందన'కు మొత్తం అయిదు అర్జీలు వచ్చాయి.

రేపు బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఉగాది మహోత్సవం



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న పురుషోత్తమశర్మ తదితరులు

తెనాలి: బ్రాహ్మణ పరిషత్, తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 22న శోభకృత్ నామ సంవత్సర ఉగాది మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ వెల్లడించారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రముఖ గాయని, చెన్నై ఫోర్డ్ కంపెనీ డిజైనర్ ఇంజినీర్ శృతి చింతలపాటి, నాద నీరాజనం ఫేమ్ డాక్టర్ మంజుల అన్నమయ్య సంకీర్తనా లహరితో వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆహ్వానపత్రికను పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమ వివరాల్ని పురుషోత్తమశర్మ వివరించారు. ప్రముఖ కవి, పండితుడు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త శ్రీమాన్ దీవి నరసింహదీక్షిత్ రచన 'శ్రీవేంకటాచల మహాత్మ్యం' గ్రంథావిష్కరణ, అనంతరం ఆయన శోభకృత్ ఉగాది పంచాంగ శ్రవణం ఉంటాయని తెలిపారు. పరిషత్ వార్షిక ఉగాది పురస్కారాన్ని ఈసారి ఏలూరుకు చెందిన డాక్టర్ మైలవరపు బి.ఎస్.శర్మకు బహూకరించనున్నట్టు చెప్పారు. గుంటూరు జిల్లా వేద పరిషత్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణప్రసాద్, వీజీఎస్ పబ్లిషర్స్ ఎస్.రామారావు, ములుకుట్ల బ్రహ్మానంద శాస్త్రి వంటి ప్రముఖులు హాజరుకానున్నట్టు వివరించారు. కార్యక్రమంలో వంగల మాధవరావు, చెన్నాప్రగడ శ్రీనివాస్, భాగవతుల రామకృష్ణ, చిలకలపూడి గోపాలకృష్ణ, లక్కరాజు లక్ష్మణరావు, దావులూరి శ్యాంసుందర్‌శర్మ, గడియారం సంగమేశ్వరశాస్త్రి, మల్లెల శ్యాం పాల్గొన్నారు.

రైతు సమస్యలకు సజీవరూపం 'సంఘర్షణ



మాట్లాడుతున్న సాహితీ విశ్లేషకులు రాజాహుస్సేన్

మంగళగిరి: అభ్యుదయ కవి గోలి మధు రచించిన కవితా సంపుటి 'సంఘర్షణ' రైతు సమస్యలకు సజీవ రూపం అని ప్రముఖ సాహితీ విశ్లేషకులు ఏ. రాజా హుసేన్ కొనియాడారు. గోలి వారి వీధిలోని కవి గోలి మధు నివాసంలో సంఘర్షణ కవితా సంపుటిపై చర్చా కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజా హుసేన్ మాట్లాడుతూ మధు కవిత్వ రచనలో కొంత సంయమనం పాటిస్తే భవిష్యత్‌లో గొప్ప కవి కాగలడన్నారు. ఆయన రైతు సమస్యలపై ప్రధానంగా సంపూర్ణ కావ్యం రాయడంతో పాటు చేనేత పరిశ్రమ, కార్మికులపై మరిన్ని కవితలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో సీజీ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మంచా విజయ్‌మోహన్‌రావు, మానవ వికాస మండలి కన్వీనర్ రేఖా కృష్ణార్జునరావు, మంగళగిరి సాహితీ వేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, కళాపోషకులు దామర్ల కుబేరస్వామి, తాటిపాముల లక్ష్మీపెరుమాళ్లు, రేకా సుధాకరరావు, డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, కంచర్ల కాశయ్య పాల్గొన్నారు.

ఎయిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది వినూత్న నిరసన



తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డుపై కరపత్రాలు పంచుతున్న ఎయిమ్స్ సిబ్బంది

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఎయిమ్స్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని విధుల నుంచి తొలగించడంతో సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఆందోళన కార్యక్రమంపై కరపత్రాలు పంపిణీ చేశారు. నులకపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎయిమ్స్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని ఎటువంటి సమాచారం, నోటీసులు లేకుండా తొలగించారని చెప్పారు. హాస్పిటల్ జాయింట్ సూపరిండెంటెండ్ డాక్టర్ రామమోహన్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ బత్తినేని హరికృష్ణ తమకు నచ్చిన వారిని పనిలో పెట్టుకుని మిగిలిన వారికి తొలగించడం దారుణమని ఖండించారు. కార్యక్రమంలో కార్యదర్శి శివశంకర్, మంగళగిరి సీఐటీయూ అధ్యక్షుడు కమలాకర్ పాల్గొన్నారు.

కోనేటిపురంలో పారిశుద్ధ్యం పరిశీలన



షెడ్‌ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు, అధికారులు

కోనేటిపురం(భట్టిప్రోలు): బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత గ్రామం (ఓడీఎఫ్ ప్లస్)గా ఎంపికైన కోనేటిపురాన్ని స్వచ్ఛభారత్ మిషన్ రీడ్స్ ఆర్గనైజేషన్ బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, నివాస గృహాల్లోని మరుదొడ్లను సభ్యులు పరిశీలించారు. స్థానిక ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ) షెడ్‌ని సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య సిబ్బంది పనితీరు బాగుందని ఉందని కితాబిచ్చారు. గ్రామస్తులందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆర్గనైజేషన్ సభ్యులు కె. సాయిబాబు, ఎస్కే మస్తాన్ కోరారు. గ్రామంలో అమలవుతున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాలను సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి అడిగోపుల చిన వెంకటేష్ బాబు వారికి వివరించారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వేరుశనగ పంట పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

నగరం: అకాల వర్షాలకు దెబ్బతిన్న దెబ్బతిన్న పంటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకుడు అక్తర్ హుస్సేన్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న రబీ పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. రైతులకు తగిన సూచనలిచ్చారు. వేరుశనగ, అపరాలు, మొక్కజొన్న పంట పొలాల్లో వర్షపు నీటి నిల్వలను తొలగించాలని చెప్పారు. వేరుశనగ, అపరాల పంటలకు అన్నబేది లీటర్ నీటికి పది గ్రాములు, నిమ్మ ఉప్పు లీటర్ నీటిలో ఒక గ్రాము కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రమేష్‌బాబు, వీఏఏలు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో..

అధిక వర్షాల నేపథ్యంలో మొక్కజొన్నలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకుడు సయ్యద్ అక్తర్ హుస్సేన్ సోమవారం రైతులకు వివరించారు. పొలాల్లో కాల్వలు తీసి అధిక నీటిని బయటకు పంపాలని సూచించారు. జొన్న, మొక్కజొన్న పెరుగుదల దశలో ఉంటే ఎకరాకు బస్తా యూరియా, అర బస్తా పొటాష్ చల్లుకోవాలని చెప్పారు. కోత దశలో ఉంటే గింజకు బూజు తెగులు రాకుండా ఎకరాకు 250 ఎంఎల్ ప్రొపికొనజోల్ (టిల్ట్) లేదా 500 ఎంఎల్ హెక్సాకానోజిల్ (కాంటాఫ్) పిచికారీ చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉమామహేశ్వర స్వామి గ్రామోత్సవం

నగరం: మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నగరం పుర వీధుల్లో శ్రీగంగా అన్నపూర్ణ సమేత ఉమామహేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి పూజా సామగ్రి అందించి, విశేష పూజలు చేశారు. తొలుత ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



జంపని(వేమూరు): జంపని డ్రైనేజీ కాలువ వంతె వద్ద ఆటో బోల్తాపడి డ్రైవరు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల మేరకు.. డ్రైవర్ వేమూరులో మద్యం తాగి జంపనికి వెళ్తుండగా.. డ్రైయినేజీ వంతెన వద్ద వాహనం అదుపు తప్పి వంతెన పక్కన ఉన్న గుంతలో బోల్తాపడింది. దీంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై ఎస్ఐ చోడయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పంటల పరిశీలన



పల్లెకోన(భట్టిప్రోలు): అకాల వర్షాలకు నేలవాలిన మొక్కజొన్న పంట పొలాలను సోమవారం మండల వ్యవసాయ శాఖాధికారి గొల్లపోతు మీరయ్య పరిశీలించారు. పల్లెకోన, కోనేటిపురం, సూరేపల్లి, భట్టిప్రోలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. నష్టం అంచనా వేశారు. పొలాల్లో గాడులు తీసి, నీరు బయటకు పంపే విధంగా చూడాలని రైతులకు సూచించారు. పై పాటుగా యూరియా ఎకరాకు 25 కిలోలు, పొటాష్ 5 కిలోలు చల్లుకోవాలని సూచించారు. తరువాత ఫార్ములా 4, కార్బండైజం 300 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలని చెప్పారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

చెరుకుపల్లి: ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ఆరేపల్లి సచివాలయంలో క్యాంప్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ అప్‌డేట్ క్యాంప్ జరుగుతుందని పేర్కొన్నారు. కొత్తగా ఆధార్ కార్డు నమోదు, మార్పులు చేర్పులు, వేలి ముద్రలు పడనివారు, చిన్న పిల్లలకు కొత్త ఆధార్ కార్డు జారీ, ఐదేళ్ల పైబడిన పిల్లల ఆధార్ అప్‌డేట్, 15 ఏళ్లు నిండిన వారి వేలిముద్రల అప్‌డేట్ వంటి అన్ని రకాల సేవలకు ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రత్యేక ఆధార్ క్యాంప్ గురించి పంచాయతీ కార్యదర్శులు గ్రామ ప్రజలకు తెలియజేయాలని ఆయన ఆదేశించారు.

మహాప్రస్థానంలో గ్యాస్ ఆధారిత చాంబర్‌కు శంకుస్థాపన



తెనాలి: పట్టణ పినపాడులోని మహాప్రస్థానంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న గ్యాస్ ఆధారిత చాంబర్ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. తెనాలి మహాప్రస్థాన సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమాన్ని అధ్యక్షుడు ఢాకా సాంబిరెడ్డి, కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్ పర్యవేక్షించారు. 'టిరా' సాఫ్ట్‌వేర్ కంపెనీ ఎండీ తుమ్మల గోపీచంద్, డైరెక్టర్ తుమ్మల బాపయ్య చౌదరి తండ్రి రాజారావు పేరిట గ్యాస్ ఆధారిత చాంబర్‌ను వితరణగా సమకూర్చినట్టు శివరామకృష్ణప్రసాద్ తెలిపారు. చాంబర్‌ను పెట్టేందుకు అవసరమైన షెడ్డు నిర్మాణానికి ఆసక్తిగల దాతలు ఎవరైనా మహాప్రస్థాన కమిటీని సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు బండి సాంబశివరావు, మొవ్వ సత్యనారాయణ, బాపయ్య చౌదరి, శంకర్‌ప్రసాద్, శంకరరావు, రామాయణం వేణు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 26వ వార్డులో ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: ప్రజల సమస్యల్ని సత్వరమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 26వ వార్డు పినపాడులోని జెండా చెట్టు నుంచి సోమవారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 26వ వార్డు కౌన్సిలర్ షేక్ ఇస్మాయేల్, వార్డు నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రభుత్వం సంక్షేమం అమలు చేస్తోందని చెప్పారు. సంక్షేమంతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా సచివాలయానికి రూ.20లక్షలను ఇస్తోందని తెలిపారు. తెనాలి నియోజకవర్గంలో రూ.16కోట్లను గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా విడతల వారీగా విడుదల చేస్తుందని వివరించారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో 54 సచివాలయాలను పూర్తి చేసినట్లు చెప్పారు. మిగిలిన 32 సచివాలయాలను త్వరలో పూర్తి చేయనున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేయడంతో పాటు వారి సమస్యల్ని తెలుసుకుని, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు అందించే ఫీడ్‌బ్యాక్‌ను కూడా ప్రభుత్వానికి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. చెత్త పన్నును నెల నెలా చెల్లించడం కష్టంగా మారిందని ప్రజలు తెలియజేయడంతో ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం చెత్త పన్నును రద్దు చేస్తూ సోమవారం అసెంబ్లీలో ప్రకటించినట్లు తెలిపారు. ఇంటి పన్నులతో కలిపి వేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ గంటూరు కోటేశ్వరరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్లు యాతాటి అనిల్, తాడిబోయిన రామయ్య, పేరం సంజీవరెడ్డి, పెద్దలంక లక్ష్మీలావణ్య, షేక్ దుబాయ్‌బాబు, మొగల్ అహ్మద్ బేగ్, ఆవుల కోటయ్య, దాసరి వీర వసంతరావు, కోమరబత్తిని జయపాల్, గడవర్తి సాయిహరేరామ్, నందివెలుగు సర్పంచ్ ధూళ్ళిపాళ్ళ పవన్‌కుమార్, 26వ వార్డు నాయకులు నాగూర్ బాబు, వెనిగళ్ళ శేషురాజా, సిహెచ్.శ్రీనివాసరెడ్డి, కోగంటి బాబ్జి, కోగంటి బాబు, కోగంటి ఆషు, రావి శ్రీనివాసరావు, అబ్రహాం లింకన్ పాల్గొన్నారు.

కష్టించేతత్వంతోనే జీవితంలో ఉన్నతి



పాటలు పాడుతున్న విద్యార్థినులు

ఆత్మకూరు(మంగళగిరి): నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న నిర్మల ఫార్మసీ కళాశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉన్నత విద్యాశాఖ మండలి సెక్రటరీ ప్రొఫెసర్ వై.నజీర్ అహ్మద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు తమలోని నైపుణ్యాలను, సృజనాత్మకతను వెలికితీసి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కష్టించేతత్వం, క్రమశిక్షణ, ఎదుటవారిని గౌరవించడం, వ్యక్తిగత పరిశీలన అంశాలు ఎంతో ముఖ్యమని, ఈ లక్షణాలు అలవరుచుకున్న వారు జీవితంలో ఉన్నత స్థానాలు చేరుకుంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ జి.జాన్‌పాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రహమాన్, సెక్రటరీ జి.నిర్మలజ్యోతి పాల్గొన్నారు.

జాతీయ మూట్ కోర్టులో కేఎల్‌యూకు అవార్డు



అవార్డులు సాధించిన కెఎల్‌యు విద్యార్థులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో బీబీఏ చదువుతున్న విద్యార్థులు ఉత్తమ మూట్ మెమోరియల్ అవార్డు అందుకున్నట్లు న్యాయ విభాగ అధిపతి జి.విజయసుధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విశ్వవిద్యాలయంలో న్యాయ కళాశాల విద్యార్థులు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు ముంబయిలోకి కాలేజ్ ఆఫ్ లా కలంబోలిలో నిర్వహించిన జాతీయ మూట్ కోర్టు పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ఎస్. గణేష్ నందా, షేక్ అక్బర్, వై. రూపాంజనాశ్రీకి ఉత్తమ మూట్ మెమోరియల్ అవార్డుతో పాటు రూ. 5 వేల నగదు బహుమతి లభించిందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న విద్యార్థులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఎంహెచ్‌ఎస్. డీన్ డాక్టర్ ఎం. కిశోర్ బాబు, న్యాయ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఇది బ్లాక్ డే..



వేమూరు అంబేడ్కర్ విగ్రహం వద్ద నేతల నిరసన..

వేమూరు: శాసన సభలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే తలశిల సుధాకర్‌బాబుపై తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు అశోక్, బాల వీరాంజనేయస్వామి దాడి చేయడంపై స్థానిక వైఎస్సార్ సీపీ ఎస్సీ, ఎస్టీ నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి, బ్లాక్ డేగా ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు పోడియం వద్దకు వెళ్లి స్పీకర్‌పైకి పేపర్ల విసరడం దారుణమని ఖండించారు. వారిని అడ్డుకున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై దాడి చేయడంతో గాయపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు నేటికీ ఎస్సీ, ఎస్టీలు అంటే చాలా చులకనగా చూస్తున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తలశిల సువర్ణరాజు, గుమ్మడి దానియేలు, దొప్పలపూడి జ్యోతిబాబు, వేమూరి మోషే, గొడుకు ప్రకాష్, తలశిల ప్రదీప్, దర్శి శ్రీకాంత్ అమర్తలూరు వెంకయ్య పాల్గొన్నారు.

విలువలు కలిగిన విద్యతో గమ్యాలు చేరుకోవాలి

- బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు



విద్యార్థులను అభినందిస్తున్న దేవినేని మల్లికార్జునరావు

రేపల్లె: విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించిననాడే గమ్యాన్ని చేరుకోగలరని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని రామకృష్ణ విద్యా నిలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన 20వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లక్ష్యాలను చేరుకునేందుకు శ్రమ, దీక్ష, పట్టుదలను ఆయుధాలుగా మలుచుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూలు అధ్యక్షుడు డాక్టర్ కుర్రా మహేష్, కరస్పాండెంట్ కుర్రా అవర్ణ పాల్గొన్నారు.